
సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 6 । జూన్ । 2025



సొంత విత్తనాలే శ్రేయస్కరం

రైతులు తమ విత్తనాలను తామే పండించుకోవడం శ్రేయస్కరమని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జి సహా పరిశోధనా సంచాలకుడు అన్నారు. 10లో ▸



మండుతున్న సూరీడు

నాలుగు రోజులుగా భానుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం నుంచి తీవ్రమైన ఎండలు, వడగాల్పులు, ఉక్కపోతతో అల్లాడుతున్నారు. 10లో ▸



యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

కొయ్యలగూడెం మండలంలోని పలు ప్రాంతాలు మట్టి అక్రమార్కులకు అడ్డాగా మారాయి. రాత్రి వేళల్లో సాగునీటి చెరువుల నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. 10లో ▸

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు



తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్‌లో పరీక్ష రాయడానికి వచ్చిన అభ్యర్థులు

భీమవరం: భీమవరంలోని నాలుగు కేంద్రాల్లో గురువారం నిర్వహించిన ఎడ్‌సెట్, లాసెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఎడ్‌సెట్ పరీక్షకు డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో 110 మందికి 88 మంది, భీమవరం డీఎన్నార్ అటానమస్ కళాశాలలో 87 మందికి 57, భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో 80 మందికి 60 మంది, విష్ణు ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 80 మందికి 44 మంది హాజరయ్యారు. అలాగే డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన లాసెట్ పరీక్షకు 110 మందికి 22 మంది గైర్హజరు కాగా, డీఎన్నార్ అటానమస్ కళాశాలలో 100 మందికి 84 మంది హాజరయ్యారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం: పట్టణంలోని వాసవీ, శశి ఇంజనీరింగ్ కళాశాలల్లో లాసెట్, ఎడ్‌సెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. వాసవీలో లాసెట్‌కు 241 మందికి గాను 204 మంది, ఎడ్‌సెట్‌కు 240 మందికి 197 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ టి.రత్నాకరరావు పర్యవేక్షించారు. శశి ఇంజనీరింగ్‌లో లాసెట్‌కు 125 మందికి 96 మంది, ఎడ్‌సెట్‌కు 125 మందికి 94 మంది హాజరయ్యారు.

మూగజీవాలను హింసిస్తే చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): మూగజీవాలను హింసించినా, అక్రమంగా రవాణా చేసినా చట్టరీత్యా చర్యలు ఉంటాయని డీఆర్వో మొగలి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా జంతు సంక్షేమ సంఘ సమావేశాన్ని నిర్వహించారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులు, దూడలను వధించరాదన్నారు.

ముందస్తు ప్రవేశాలను అడ్డుకోవాలి



తాడేపల్లిగూడెం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాలు అమ్మడం, ముందస్తు అడ్మిషన్లు నిర్వహించడం చేస్తున్నారని, వారిని అదుపు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆర్డీఓకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విద్యా హక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షుడు పతివాడ నాగేంద్రబాబు మాట్లాడుతూ విద్యాసంస్థల్లో పుస్తకాలు అమ్మడం నిషేధమన్నారు. జూన్ 12 వరకు పాఠశాలలు నిర్వహించరాదని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా పలు స్కూళ్లు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు కె.రోహిత్, కె.గోవిందు, ఎన్.సాయి పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతుల నిర్వహణపై ఆగ్రహం



శ్రీ చైతన్య పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న నగరంలోని విద్యానగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపు రద్దుచేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం తరగతులు బాయ్‌కాట్ చేయించి విద్యార్థులను ఇంటికి పంపించి వేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ వేసవి సెలవుల్ని పక్కన పెట్టి గురువారం నుంచి ఈ పాఠశాలలో తరగతులు నిర్వహించడం అంటే విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘించడమే అన్నారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్ష కూడా నిర్వహించడం గుర్తించామన్నారు. విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘించిన ఈ బ్రాంచ్ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్షుడు వై.యశ్వంత్ పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి.. భ్రాంతి

యువతను ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అనుసంధానం చేస్తామన్నారు.. పరిశ్రమలు తెచ్చి ఉద్యోగాలిస్తామన్నారు.. ఉద్యోగం వచ్చే వరకూ నెలకు రూ.3 వేల నిరుద్యోగభృతి ఇచ్చే బాధ్యత తాము తీసుకుంటామని చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు.. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా నిరుద్యోగభృతి హామీపై నోరుమెదపకపోవడం యువతను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.

బాబు మార్కు టోకరా

- జాబు కావాలంటే బాబు రావాలన్న కూటమి
- నిరుద్యోగులకు నెలకు రూ.3,000 ఇస్తామని హామీ
- ఏడాదైనా నిరుద్యోగ భృతి ఊసెత్తని సర్కారు
- జిల్లాలో 5.17 లక్షల కుటుంబాల ఎదురుచూపులు
- కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న వాటినీ తొలగిస్తున్న వైనం
- యువతకు అండగా నిలిచిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

సాక్షి గ్రాండ్ లివెల్



సాక్షి, భీమవరం: జిల్లాలో దాదాపు ఎనిమిది ఇంజినీరింగ్ కళాశాలలు, 55 వరకు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. పాలిటెక్నిక్, వృత్తివిద్య కోర్సులు కళాశాలలు 20కు పైగా ఉన్నాయి. వేలాది మంది విద్యార్థులు వీటిలో విద్యాభ్యాసం సాగిస్తున్నారు. ఇప్పటికే డిగ్రీ, ఇంజినీరింగ్ పూర్తిచేసి డీఎస్సీ, గ్రూపు పరీక్షలు, పోలీస్ రిక్రూట్‌మెంట్, ఏపీపీఎస్సీ తదితర వాటి ద్వారా ప్రభుత్వ కొలువుల కోసం జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, పాలకొల్లు పట్టణాల్లోని కోచింగ్ సెంటర్లు, ఇంటి వద్ద ప్రిపేర్ అవుతున్న వారు వేలల్లో ఉంటారు. జిల్లా నుంచి ఇతర విశాఖ, విజయవాడ, హైదరాబాద్ తదితర నగరాల్లో ఉంటూ ఎంతోమంది పోటీ పరీక్షల కోసం శిక్షణ పొందుతున్నారు. వీరంతా శిక్షణ ఇచ్చే సంస్థలకు వేలు, లక్షల్లో ఫీజులు చెల్లిస్తున్నారు. తమ బిడ్డల భవిష్యత్తు కోసం అయినకాడికి అప్పులు చేసి శిక్షణ ఇప్పిస్తున్న తల్లిదండ్రులు ఎందరో. హాస్టల్, మెస్ నిమిత్తం నెలకు రూ.6 వేలకు పైనే ఖర్చవుతుంది. మరోపక్క డిగ్రీ, ఇంజినీరింగ్, ఇతర పై చదువులు చదువుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితులతో చాలీచాలనీ జీతంపై వివిధ వ్యాపార, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న వారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. వీరిలో తమ చదువుకు తగిన ఉద్యోగం కోసం వేచి చూస్తున్నవారు చాలామంది ఉన్నారు.

భృతిపై గంపెడాసలు : ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన ఉద్యోగాల కల్పన, అంతవరకు ప్రతి నెలా ఇస్తామన్న భృతి హామీల అమలుకు జిల్లాలోని 5.17 లక్షల కుటుంబాలు గంపెడాసతో ఎదురుచూస్తున్నాయి. ఏపీపీఎస్సీ ఓపెన్ కేటగిరీ అభ్యర్థులకు 42 ఏళ్లు, రిజర్వు కేటగిరీ అభ్యర్థులకు ఐదేళ్లు అదనపు వెసులుబాటు ఉంటుంది. ఈ మేరకు ఇంటర్ నుంచి 47 ఏళ్ల వయసు పరిగణనలోకి తీసుకుని భృతి అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు. రూ.3 వేలు తమకు ఎంతో ఆసరా అవుతాయని వారంటున్నారు.

ఉన్న వాటికీ కొర్రీ

కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న వాటిని తొలగించే పనిలో కూటమి ప్రభుత్వం ఉంది. ఎన్నికల ముందు వలంటీర్ల జీతం రూ.10 వేలు చేస్తామని చెప్పి వారిని విధుల్లోకి తీసుకోకుండా పక్కన పెట్టేసి జిల్లాలో 8,616 మంది వలంటీర్లను సేవలకు దూరం చేసింది. కూటమి నేతలకు మద్యం షాపులు కట్టబెట్టేందుకు ప్రైవేట్ మద్యం పాలసీ తేవడంతో గతంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసిన 893 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది రోడ్డున పడ్డారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఎంతోమంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లపై వేటు వేశారు. జిల్లాలోని సచివాలయాల్లో 1,066 ఖాళీ పోస్టులు ఉండగా వాటిని భర్తీ చేయకుండా క్లస్టర్ల పేరిట ఉద్యోగులను క్రమబద్ధీకరించి మిగిలిన వారిని ఇతర శాఖల్లో భర్తీ చేసే యోచన చేస్తోంది.

భృతి.. భ్రాంతేనా ?

2014 ఎన్నికల్లో రూ.2 వేల చొప్పున భృతి ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాలుగున్నర సంవత్సరాల పాటు ఆ ఊసే ఎత్తలేదు. నాటి విపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒత్తిడి తీసుకురావడంతో 2019 ఎన్నికలకు ఆరు నెలల ముందు యువనేస్తం అంటూ తంతు నడిపించారు. 22 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసున్న, డిగ్రీ చదివిన వారిని మాత్రమే అర్హులుగా ప్రకటించారు. జిల్లాలో లక్ష మందికి పైగా నిరుద్యోగ యువత ఉంటే పలు వడపోతల నడుమ సుమారు ఆరు వేల మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారు.

గత ప్రభుత్వంలో నిరుద్యోగులకు భరోసా

2014–19 వరకు టీడీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా కేవలం 34,108 మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పిస్తే 2019–24 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే శాశ్వత, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో 15 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించడం గమనార్హం. వీటిలో సచివాలయ ఉద్యోగాలు 4,230 మంది ఉన్నాయి.

నిరుద్యోగులకు నిరాశే



ఉన్నత చదువులు చదివి ఉద్యోగం లేక ఇబ్బంది పడుతున్నాను. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఇచ్చిన హామీని అమలు చేయాలి. కూటమి నాయకులు చెప్పినట్టు నిరుద్యోగులకు భృతి రూ.3 వేలు ఇచ్చి ఆదుకోవాలి. ఆ దిశగా ప్రభుత్వం ముందడుగు వేయాలి.

– కొప్పిశెట్టి లోవచంద్ర మహేష్, నిరుద్యోగి, భీమవరం

భృతి ప్రస్తావనే లేదు



కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదు. ఇలా మోసపూరిత వాగ్దానాలతో యువతను మోసగించడం తగదు. చంద్రబాబు 2014 ఎన్నికల్లోనూ నిరుద్యోగ భృతి అంటూ మోసం చేశారు. మరలా 2024 ఎన్నికల్లో అదే హామీ ఇచ్చి మోసం చేస్తున్నారు.

– కె.ప్రవీణ్ కుమార్, సీతారాంపురం

వెన్నుపోటు దినం

సూపర్ సక్సెస్

- జిల్లావ్యాప్తంగా ప్రభుత్వంపై పెల్లుబికిన వ్యతిరేకత
- అన్ని వర్గాల ప్రజలూ భాగస్వాములయ్యారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి



ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో వంచన, మోసాలను ప్రశ్నిస్తూ ప్రజలకు న్యాయం చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో విజయవంతమయ్యాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ప్రత్యేకించి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ నిర్వహించిన నిరసన ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి, ఆవేదన పెల్లుబికిందన్నారు. నిరసనల్లో ప్రజలు కూడా పెద్ద ఎత్తున భాగస్వాములయ్యారని వివరించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ పెద్దలు కళ్లు తెరవాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండుటెండను కూడా లెక్క చేయకుండా నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న జిల్లాలోని పార్టీ ముఖ్య నేతలకు, పార్టీ పదవుల్లో వివిధ హోదాల్లో ఉన్న నాయకులకు, పార్టీ స్థానిక సంస్థల ప్రతినిధులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పారు. ఏడాది కాలంగా ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టి, ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వంపై హామీలు అమలు చేసేలా ఒత్తిడి తేవడంలో ముందుముందు కూడా వైఎస్సార్‌సీపీ పెద్దెత్తున పోరాటాలు చేస్తుందని చెప్పారు. ఈ ఏడాది కాలంగా రైతులు, విద్యార్థులు, మహిళలు, కార్మికులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల వారు కూటమి నిర్లిప్త పాలన కారణంగా నలిగిపోతున్నారన్నారు. 2019–24 కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి నెలా ఏదో ఒక పథకం రూపంలో ప్రజలకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమచేసేదని గుర్తు చేశారు. కూటమి పాలనలో పనుల్లేక, చేతిలో చిల్లిగవ్వ లేకుండా పేదలు అప్పులు చేసుకుని జీవిస్తున్నారని ముదునూరి ఆవేదన వ్యక్తం చేశారు.



కరుణించమ్మా..

కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల క్షేత్ర దేవతగా విరాజిల్లుతున్న కుంకుళ్లమ్మవారి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ఆలయ వార్షికోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉదయం నుంచి ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 9 గంటలకు అమ్మవారి మూలవిరాట్, ఉత్సవమూర్తులకు నవకలశ స్నపనను అర్చకులు జరిపించారు. అనంతరం శ్రీ చక్రార్చన, సప్తశతి పారాయణ, హోమాలను, మహా పూర్ణాహుతి వేడుకను నేత్రపర్వంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

– ద్వారకాతిరుమల

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): మొక్కలు నాటడంతో పాటు, ప్రకృతి సమతుల్యతను కాపాడటానికి కాలుష్య కారకంగా ఉన్న ప్లాస్టిక్ నియంత్రణే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అంతట ×వనం–మనం్జ పేరిట మొక్కలు నాటడం, కాలువలు, డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు, అధికారులు భీమవరం కలెక్టరేట్‌లో మొక్కలు నాటారు. అనంతరం విస్సాకోడేరు కాలువ వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలను, జేపీ రోడ్డులోని అడ్డ వంతెన వద్ద కాలువ గట్లపై ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమంలో కలెక్టర్ పాలఒగన్నారు. కాలువల్లో వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా 3.85 లక్షల మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అటవీశాఖ పర్యవేక్షణలో జిల్లాలోని వెంకటరామన్నగూడెం, సీతారాంపురం, కొణితివాడ గ్రామాల్లో నర్సరీలను అభివృద్ధి చేశామన్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, జిల్లా అటవీ శాఖ అధికారి డి.ఆశాకిరణ్, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివన్నారాయణరెడ్డి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, ఆర్డీఓలు కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, దాసిరాజు, కతీబ్ కౌసర్ భానో పాల్గొన్నారు.



భీమవరం కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ నాగరాణి

రోగుల నుంచి సొమ్ముల వసూలును ఊరుకోం

ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగుల నుంచి సిబ్బంది సొమ్ములు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ నాగరాణి హెచ్చరించారు. భీమవరం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వైద్యాధికారులు, ఏరియా ఆస్పత్రి డాక్టర్లు, సూపరింటెండెంట్లతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు, రోగులకు అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాలు కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెంచేలా గర్భిణులను ప్రోత్సహించాలని కలెక్టర్ అన్నారు.

నవధాన్యాల సాగుతో

భూసారం పెంపు



నవధాన్యాల సాగును పరిశీలిస్తున్న అధికారులు

భీమవరం: వరి సాగు అనంతరం భూమిలో నవధాన్యాల సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుందని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వై.నూకరాజు తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్ కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. నవధాన్యాల సాగు వల్ల భూమిలో సూక్ష్మజీవుల జీవనం పునరుత్థానమవుతుందని, తద్వారా భూమి సారవంతమై ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గుతుందన్నారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీజామృతం, ఘన, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, అగ్నాస్త్రం, కోడిగుడ్డు నిమ్మ రసం ద్రావణం, బయో కల్చర్ తయారీ విధానాల వల్ల ప్రయోజనాలను రైతులకు వివరించారు. వైద్య శాస్త్ర విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తోతాపురి.. ధర దిగజారి

- దారుణంగా ధరల పతనం
- టన్ను రూ.15 వేల నుంచి రూ.3 వేలకు తగ్గుదల
- మామిడి రైతుల గగ్గోలు

నూజివీడు: గత 20 ఏళ్లలో ఎన్నడూలేని సంక్షోభాన్ని మామిడి రైతులు ఎదుర్కొంటున్నారు. పండ్లలో రారాజుగా పేరొందిన మామిడి రైతులను ఈ ఏడాది కోలుకోలేని నష్టాల ఊబిలో ముంచేసింది. తోతాపురి రకం ధర దారుణంగా పతనమవ్వడంతో రైతులు, వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఈ ఏడాది మామిడి దిగుబడి తక్కువగా ఉన్న నేపథ్యంలో ధర ఎక్కువగా ఉంటుందనుకున్న మామిడి రైతుల ఆశలు అడియాశలు అయ్యాయి. ఏలూరు జిల్లాలో నూజివీడు, చింతలపూడి ప్రాంతాల్లో దాదాపు 50 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. వరి, మొక్కజొన్న పంటల తర్వాత ప్రధాన ఉద్యాన పంటగా విరాజిల్లుతున్న మామిడి రైతులకు చేదునే రుచిచూపుతోంది. మార్చి ప్రారంభం నుంచి మామిడి కోతలు ప్రారంభం కాగా తొలుత ఆశాజనంగా ఉన్న తోతాపురి ధర రానురాను తగ్గుతూ వచ్చి ప్రస్తుతం పూర్తిగా పతనమైంది. టన్ను రూ.3 వేలకు పడిపోవడంతో రైతులకు, వ్యాపారులకు కోత కూలి, కిరాయిలు కూడా రాని పరిస్థితి. దీంతో రైతులు, కాయలు కొనుగోలు చేసిన వ్యాపారులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ప్రారంభంలో తోతాపురి రకం టన్నుకు రూ.15 వేల వరకు ధర వచ్చింది. ఆ తర్వాత క్రమేపీ రూ.9 వేలకు, రూ.5 వేలకు పడిపోయి ప్రస్తుతం రూ.3 వేలు పలుకుతోంది. దీంతో ఈ రకం సాగుచేసిన రైతులు లబోదిబోమంటున్నారు.



తోతాపురి మామిడి కాయలు

ప్రారంభంలో కావాలనే ధర పెంచుతూ..

మామిడి కాయలను మార్కెట్‌కు రప్పించేందుకు సీజన్ ప్రారంభంలో సేట్లు ఎక్కువ రేటు వేస్తున్నారనేది మామిడి రైతుల వాదన. నూజివీడు, ఆగిరిపల్లి, విస్సన్నపేట, నున్న మార్కెట్‌లకు ఉత్తరాది రాష్ట్రాల నుంచి సేట్లు కాయల కొనుగోలు నిమిత్తం వస్తారు. వీరు సీజన్ కొద్దిరోజులు గడిచిన తర్వాత క్రమేణా ధరను తగ్గిస్తూ చివరకు అతి తక్కువ ధరకు తీసుకువస్తున్నారు. దీనికి తోడు చిత్తూరు జిల్లాలో అధిక శాతం జ్యూస్ ఫ్యాక్టరీలు తెరవకపోవడంతో కొనుగోళ్లు అంతగా లేకపోవడం కూడా ధర పతనమవ్వడానికి కారణమని వ్యాపారులు అంటున్నారు.

కనీస మద్దతు ధర ప్రకటిస్తేనే.. మామిడికాయల ధర నిర్ణయం కొనుగోలు చేసే సేట్‌కు, కమీషన్ దుకాణదారుడికి మధ్య ఉంటోంది తప్పితే కాయలను మార్కెట్‌కు తోలుకొచ్చిన రైతు సమక్షంలో నిర్ణయించడం లేదు. కమీషన్ వ్యాపారి టన్ను ధర ఎంత అంటే అంతే. అలాకాకుండా ప్రభుత్వం మామిడికాయల రకాలను బట్టి టన్నుకు కనీస మద్దతు ధరను ప్రకటించి అంతకంటే తక్కువకు కొనుగోలు చేయడానికి వీల్లేదంటే రైతులకు కొంత మేర ఉపయోగం ఉంటుంది. ఈ ఏడాది 95 శాతానికి పైగా రైతులు నష్టాల పాలైన నేపథ్యంలో తమను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

పెట్టుబడులు కూడా రావు



తోతాపురి రకం ధర టన్ను రూ.3 వేలకు పడిపోయింది. ఇలా అయితే కోత కూలి, కిరాయి డబ్బులు కూడా రాని పరిస్థితి. 14 ఎకరాల మామిడి తోట ఉండగా రూ.6 లక్షల పెట్టుబడి పెట్టాను. పెట్టుబడులు కాదు కదా.. సగం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

– లావు ధనకోటేశ్వరరావు, కొత్త రావిచర్ల, నూజివీడు మండలం

వృద్ధులకూ తప్పని పరేషన్



బియ్యం మూటతో 70 ఏళ్ల వృద్ధుడు

కుక్కునూరు: కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో వృద్ధులు రేషన్ కోసం పాట్లు పడుతున్నారు. 65 ఏళ్లు దాటిన వారికి ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందిస్తామన్న ప్రభుత్వ పెద్దల మాట నీటిమూటలుగా మారాయి. పలువురు రేషన్ డీలర్లు వృద్ధుల ఇళ్లకు వెళ్లి బయోమెట్రిక్ లో వేలిముద్రలు తీసుకొని చౌక డిపోకు వచ్చి సరుకులు తీసుకువెళ్లాలని చెప్పినట్టు తెలిసింది. దీంతో వృద్ధులు మండుటెండలో రేషన్ కోసం డిపోలకు వెళుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటే తమకు ఈ కష్టాలు ఉండేవి కావని గురువారం కుక్కునూరులో బియ్యం మూటలతో వెళుతున్న వృద్ధులు అన్నారు.

క్లుప్తంగా

విక్టర్‌బాబుపై పీడీ యాక్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం : చట్టాన్ని ఉల్లంఘిస్తూ ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తున్న భీమవరం పట్టణంచిన అప్పారావుతోటకు చెందిన కొత్తపల్లి విక్టర్ బాబుపై పీడీ యాక్ట్ ప్రయోగించినట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి చెప్పారు. గురువారం భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. విక్టర్‌బాబు భీమవరం వన్‌టౌన్, టూటౌన్, కాళ్ల, ఉండి పోలీసుస్టేషన్లలో వివిధ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో అతడిపై పీడీ యాక్ట్ ప్రయోగించి ముందుస్తు నేర నియంత్రణ చర్యలో భాగంగా రాజమహేంద్రవరం జైలుకు పంపించినట్లు ఎస్పీ తెలిపారు.

ఫర్నిచర్ షాపులో అగ్నిప్రమాదం

ఎగసిపడిన అగ్నికీలలు.. భారీ ఆస్తి నష్టం



ఫర్నిచర్ షాపులో జరిగిన అగ్నిప్రమాదంలో అగ్ని కీలలు ఎగసిపడుతున్న దృశ్యం

ఏలూరు టౌన్ : ఏలూరు రూరల్ ప్రాంతంలోని ఒక ఫర్నిచర్ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. గురువారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు. వివరాల ప్రకారం.. ఏలూరు బీడీ కాలనీ ప్రాంతానికి చెందిన మాదాబత్తుల వెంకటేష్ ఏలూరు రూరల్ పరిధిలో జేఎంజే స్కూల్ సమీపంలో గణేష్ సోఫా అండ్ ఫర్నిచర్ వర్క్స్ పేరుతో దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఫర్నిచర్ షాపులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నికీలలు ఎగసిపడడంతో దుకాణంలో పనిచేస్తున్న కార్మికులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైర్ ఇంజన్లతో అతికష్టం మీద రెండు గంటలకు పైగా శ్రమించి మంటలను అదుపు చేశారు. ఆస్తి నష్టం అంచనా వేసేందుకు రాత్రివేళ కావటంతో ఆలస్యం అవుతుందని, భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోందని అగ్నిమాపక శాఖ ఏలూరు అధికారి రామకృష్ణ తెలిపారు.

ఆస్తి తగాదాలో కత్తులతో ఇరువర్గాల దాడి

ఏలూరు టౌన్: అన్నదమ్ముల మధ్య ఆస్తి పంపకాల్లో తీవ్ర వివాదం నెలకొనటంతో ఇరు వర్గాలు కత్తులతో దాడులకు పాల్పడ్డారు. గాయాలపాలైనవారు ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. ఈ ఘర్షణపై ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలు ఫిర్యాదులు చేశారు. శ్రీపర్రు గురకలపేట ప్రాంతానికి చెందిన మండేల గంగరాజు అతని సోదరుడు మండేల రవీంద్రబాబుకు మధ్య ఆస్తి తగాదా ఉంది. ఈ నేపథ్యంలో గురువారం ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ గొడవల్లో గంగరాజు, గంటసాల కుమారస్వామి, గంటసాల పెద్దిరాజు గాయపడగా, రెండవ వర్గం రవీంద్రబాబు, మండల రామరాజుకు గాయాలయ్యాయి. ఏలూరు రూరల్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మండుతున్న సూరీడు

- ఉదయం నుంచే భానుడి భగభగలు
- వడగాలులు, ఉక్కపోతలతో అల్లాడుతున్న జనం
- వృద్ధులు, చిన్నపిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



భీమవరంలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు



సోడా తాగుతున్న వ్యక్తి



ఎండలో తలపై టవల్‌తో..

భీమవరం (ప్రకాశం చౌక్): రోహిణి కార్తె ప్రారంభంలో ముందుగానే వచ్చిన రుతుపవనాల కారణంగా వర్షాలు పడడంతో వాతావరణం చల్లబడి అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే గత నాలుగు రోజులుగా భానుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం నుంచి తీవ్రమైన ఎండలు, వడగాలులు, ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. రోజూ దాదాపుగా అన్నిచోట్లా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే భయాందోళన చెందే పరిస్థితి నెలకొని ఉంది. ఉద్యోగాలకు, ఇతర పనులకు వెళ్లే వారు ఉదయం 8 గంటలకే ఆయా పనులకు వెళ్లిపోతున్నారు. ఉదయం నుంచే తీవ్రమైన ఎండ ఉండడంతో జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణం సాగించే ప్రయాణికులు, వాహనదారులు వేడికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు దారి మధ్యలో చెట్ల నీడల్లో సేదతీరుతున్నారు. ఎండ వేడిని తట్టుకోలేక ప్రజలు శీతలపానీయాలను ఆశ్రయిస్తూ సేదతీరుతున్నారు. ఎండ దెబ్బకు పగటి పూట చేయాల్సిన పనులు కొందరు రాత్రులు చేసుకునే పరిస్థితి ఉంది. కొన్ని చోట్ల టెంట్లు వేసుకుని అత్యవసరమైన పనులు చేసుకుంటున్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తాలు తీసుకోవాలి

ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారి నుంచి రక్షణ పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి జి.గీతాభాయి వివరించారు.

- సాధ్యమైనంత వరకు ఎండలో తిరగరాదు. తప్పనిసరి పరిస్థితుల్లో తలకు టోపి, లేదా టవల్ కట్టుకోవడం, గొడుగు వేసుకుని వెళ్లడం మంచిది. మంచినీళ్లు అందుబాటులో ఉంచుకోవాలి.
- నలుపు, ముదురు రంగు దుస్తులు కాకుండా తెలుపు లేదా లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలి.
- రోడ్ల మీద విక్రయించే పానీయాలు (రంగునీళ్లు), కూల్‌డ్రింక్స్ తాగరాదు.
- మాంసాహారం, మసాలాతో తయారుచేసిన ఆహారం తినరాదు. ఆకు కూరలు, కూరగాయలతో తయారు చేసిన ఆహారం మేలు.
- పరిశుభ్రమైన నీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఇంటిలో తయారుచేసే పండ్ల జ్యూసులు తీసుకోవాలి.
- మద్యం సేవించడం, పొగ తాగడం వంటివి చేయరాదు. మద్యం సేవించి ఎండలో ప్రయాణించడం మంచిదికాదు.
- వృద్ధులు, గర్భిణీలు, చిన్నపిల్లలు ఇంటిలోనే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలోకి వెళ్లనీయరాదు.
- వేసవి సెలవులు కాబట్టి పిల్లలు బయటకు వెళ్లే ఆడుకోవడానికి ప్రయత్నం చేస్తారు. వారికి ఇంటిలోనే ఆటలు ఆడుకునేలా ఏర్పాట్లు చేసుకుంటే మంచిది.

అవగాహన కల్పిస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు వడ దెబ్బకు గురికాకుండా వారికి అవగాహన కల్పించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు అదేశాలు జారీ చేశాం. వారు గ్రామాల్లోని ఎంఎల్ హెచ్‌పీ, ఆశ, ఏఎన్ఎంల ద్వారా ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించడం జరుగుతుంది. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉంచాం. వడదెబ్బ తగిలిన వారికి మెరుగైన వైద్యం అందిచేందుకు వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచాం.

– జి.గీతాభాయి, జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారిణి భీమవరం

వడదెబ్బ తగిలితే ప్రథమ చికిత్స ఇలా

ఎవరైనా వడ దెబ్బకు గురైతే కళ్లు తిరిగి పడిపోవడం, శరీరం చెమటలు పట్టడం, స్పృహలో లేకపోవడం జరుగుతుంది. అలాంటి వ్యక్తిని ముందుగా నీడకు చేర్చి చల్లనీ నీళ్లతో శరీరాన్ని తుడవాలి. శరీరం సాధారణ స్థితికి వచ్చేవరకు తడి గుడ్డతో తుడుస్తూ చల్లగాలి తగిలేలా చూడాలి. ఉప్పు కలిపిన మజ్జిగ గానీ ఓఆర్ఎస్ ద్రావణాన్ని గానీ తాగించాలి. నిర్లక్ష్యం చేయకుండా దగ్గరలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యులకు చూపించాలి.

ఎస్సై సమయస్ఫూర్తి.. నిలిచిన నిండుప్రాణం



కావలి ప్రాంతంలో క్షతగాత్రుడు

ఆకివీడు: రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారి పడిపోయిన వ్యక్తిని సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఎస్సై సమయస్ఫూర్తితో గుర్తించి రక్షించారు. వివరాల ప్రకారం ఆకివీడు మండలం కమతవానిగూడెంకు చెందిన నతానియేలుతో పాటు మరో 8 మంది ఉపాధి నిమిత్తం తిరుపతి వలస వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని తిరిగి బుధవారం రాత్రి ఆకివీడుకు తిరుమల – నర్సపూర్ రైలు బండిలో వస్తుండగా నతానియేలు ప్రమాదవశాత్తూ కదులుతున్న రైలు నుంచి జారి పడిపోయాడు. చీకట్లో ఏ ప్రాంతంలో పడిపోయాడో కూడా తెలియదు. వెంటనే బంధువులు గమనించి ఆకివీడు ఎస్సై హనుమంతు నాగరాజుకు ఫోన్ ద్వారా విషయం వివరించారు. ఆయన సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా క్షతగాత్రుడు కావలి ప్రాంతంలో పడిపోయినట్లు గుర్తించి సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేసి పోలీసుల్ని అప్రమత్తం చేశారు. ఘటనా స్థలంలో పడిపోయి ఉన్న నతానియేలును గుర్తించి కావలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా నతానియేలుకు సకాలంలో వైద్యం అందడంతో అతడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని, కానీ రెండు కాళ్లూ విరిగిపోయి, తలకి బలమైన గాయమైందని పోలీసులు చెప్పారు. ఎస్సై హనుమంతు నాగరాజు సమయస్ఫూర్తిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా



కొయ్యలగూడెం మండలం కన్నాయిగూడెం ఊర చెరువులో రాత్రివేళ మట్టి తోలకాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మండలంలోని పలు ప్రాంతాలు మట్టి అక్రమార్కులకు అడ్డాగా మారాయి. రాత్రి వేళల్లో సైతం సాగునీటి చెరువుల నుంచి మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొయ్యలగూడెం సమీపంలోని శ్రీరామ గట్టు చెరువు, కన్నాయిగూడెం సమీపంలోని ఊర చెరువుల నుంచి గురువారం వందల కొద్ది ట్రక్కుల్లో మట్టి అక్రమ రవాణా కొనసాగింది. పంట పొలాలకు వెళ్లే రహదారులు ధ్వంసం అవుతున్నాయని శ్రీరామ గట్టు చెరువు ఆయకట్టు రైతులు ఆందోళన చేపట్టి మట్టి వాహనాలను అడ్డుకున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. కన్నాయిగూడెం ఊర చెరువు నుంచి రాత్రి వేళల్లో జేసీబీ యంత్రాలతో మట్టి అక్రమ తోలకాలను నిర్వహించారు. మట్టి అక్రమార్కులకు నియోజకవర్గ పెద్దల అండదండలు ఉండడం వల్ల తామేమి చేయలేకపోతున్నామని ప్రభుత్వ అధికారులు పేర్కొంటున్నారు. రవాణా అవుతున్న మొత్తం మట్టి ఇటుక బట్టీలకు, కమర్షియల్ లేఅవుట్ల నిర్మాణానికి తరలించి జేబులు నింపుకుంటున్నారు.

మిగులు భూముల్లో నిరసనగా ఏరువాక



ముంపు లేని మిగులు భూముల్లో విత్తనాలు చల్లుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ముంపు లేని మిగులు భూముల్లో ఏరువాక కార్యక్రమం నిర్వహించి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. మండలంలోని ఏ పోలవరం చిన్నవారి గూడెం గ్రామాల ప్రాజెక్టు ఏరియాలో అకాల వర్షాలు కురవడంతో పేదలందరూ ఐక్యంగా దుక్కు దున్ని విత్తనాలు చల్లి సాగు ప్రారంభించారు. రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ రవి మాట్లాడుతూ.ప్రాజెక్టు ముంపు లేని మిగులు భూముల్లో పేదలందరూ ఐక్యంగా సాగు ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఈ భూమి పేదలు సాగు చేస్తున్నప్పటికీ ఈ ఏడాది వర్షాలు ముందుగా రావడంతో విత్తనాలు నారు మడలు పోసి వరి నాట్లకు సిద్ధం కావాలన్నారు. ఇదే సందర్భంలో ఎర్రకాలువ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూస్వాముల నుంచి వేలాది ఎకరాలు ప్రభుత్వం సేకరించిందని, ఇందుకు లక్షల కోట్ల పరిహారం పొందిన భూస్వాములు అక్రమంగా వరి, మొక్క జొన్న, చెరుకు, అరటి జామా యిల్, పామా యిల్ కొబ్బరి పంటలు సాగు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముంపు లేని భూముల్లో పేదలకు సాగు చేసేందుకు ఇవ్వమని కోరుతున్నా పట్టించుకోకుండా అధికారులు భూస్వాములతో కుమ్మక్కై ఇరిగేషన్ చట్టాలను తుంగలో తొక్కుతున్నారని దుయ్యబట్టారు. దీనిపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హైకోర్టును ఆశ్రయించగా పేదలు ఈ భూములను సాగుచేసుకునేలా కోర్టు తీర్పు ఇచ్చిందని, ఈ తీర్పును అధికారులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు యాగంటి సీతా గుడెల్లి వెంకట్రావు, ఏ ప్రభాకర్ రావు, జి సూర్య కిరణ్, పిల్లి చంటి, కే సుబ్బారావు ఎర్రమాల కుమారి, బత్తుల వెంకన్న, బొక్క వెంకటేష్, రెడ్డి బోయిన సత్యావతి, బెల్లంకొండ శివయ్య, పిల్లి పోతురాజు, పి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సొంత విత్తనాలే శ్రేయస్కరం

మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జి సహదేవరెడ్డి



సార్వా విత్తన దినోత్సవంలో మాట్లాడుతున్న డా. సహదేవరెడ్డి

పెనుమంట్ర: రైతులు తమ విత్తనాలను తామే పండించుకోవడం వల్ల ప్రభుత్వ సంస్థలపై ఒత్తిడి తగ్గడమే కాకుండా నాణ్యమైన ఆరోగ్యకరమైన విత్తనాలు లభిస్తాయని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జి సహ పరిశోధనా సంచాలకులు డా.బి. సహదేవరెడ్డి అన్నారు. సార్వా విత్తన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మార్టేరు పరిశోధనా స్థానం నుంచి విడుదల చేయబడిన ఎంటీయూ 1318 రకం రైతుల మన్ననలు పొంది రాష్ట్రంలో అధిక విస్తీర్ణంలో సాగు చేయబడుతుందని తెలిపారు. రైతులు స్వర్ణ రకానికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ – 1318ని సాగుచేస్తున్నట్లుగా తెలియజేశారు. ఈ రకం సాగుచేసే రైతులు ఎకరాకు సిఫారసు చేసిన 36 కిలోల నత్రజనికి బదులుగా 24 కిలోల నత్రజనిని కేవలం రెండు దఫాలుగా నాటే సమయంలోనూ, చిరుపొట్ట దశలోనూ వేసుకోవాలని తెలిపారు. లేని పక్షంలో పంటకాలం పెరిగే అవకాశంతో పాటూ, ఎండు తెగులు, మానుకాయ ఆశించే ప్రమాదముందన్నారు. ఎంటీయూ 1121లో ఎక్కువ నూక శాతం రావడానికి గింజ గట్టిపడే దశలో వర్షాలు కురవడం, ఎక్కువకాలం పంట కోయకుండా చేనుపైనే ఉంచడం కూడా కారణమని తెలిపారు.

స్వర్ణకి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1318

ప్రధాన శాస్త్రవేత్త (వరి) డా.ఎం.గిరిజా రాణి మాట్లాడుతూ ఎంటీయూ 1310 రకం గతేడాది ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాల్లో రైతుల మన్ననలు చూరగొందని చెప్పారు. స్వర్ణకి ప్రత్యామ్నాయంగా రూపొందించబడిన ఎంటీయూ 1318 గోదావరి మండలంలోని ఐదు జిల్లాల్లో సుమారు 36 శాతం విస్తీర్ణంలో సాగు చేయబడుతుందని తెలిపారు. ఆదేవిధంగా సన్న గింజ రకాలైన ఎంటీయూ 1224, ఎంటూ 1262 కృష్ణా జిల్లాలో అధిక విస్తీర్ణంలో బీపీటీ 5204కి ప్రత్యామ్నాయంగా సాగుచేయబడుతుందన్నారు. చౌడు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎంసీఎం 103 రకం మంచి దిగుబడులు ఇస్తుందని తెలిపారు. సన్న గింజ రకాలైన బీపీటీ 2846, 2782 రకాలను మామూలు భూముల్లో సాగుచేయవచ్చని ఆమె వివరించారు. ముంపు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎంటీయూ 1232, 1140, 1172, 1223, పీఎల్ఏ 1100 సాగుచేసుకోవాలని తెలిపారు. దాళ్వాలో ఎంటీయూ 1121, 3626తో పాటుగా పీఆర్ 126కి ప్రత్యామ్నాయంగా రూపొందించబడిన ఎంటీయూ 1010, 1293, 1290, 1156, 1153 రకాలు మన రాష్ట్రంలోనే కాక ఇతర రాష్ట్రాల్లో కూడా మన్ననలు పొందాయని తెలిపారు.

ఎంటీయూ 1426 కిట్లు రైతులకు అందజేత

ఈసందర్భంగా పలువురు రైతులకు ఆర్ఎన్ఆర్ 15048 రకానికి ప్రత్యామ్నాయంగా రూపొందించబడిన చిరుసంచి రకం ఎంటీయూ 1426 కిట్లను అభ్యుదయ రైతులకు అందజేశారు. శాస్త్రవేత్తలు డా.ఎంవీ కృష్ణాజీ డా.ఎస్.దయాకర్, డా.సీహెచ్ శ్రీనివాస్, డా.వి.భువనేశ్వరి, డా.ఎస్.శ్రీనివాస రావు, డా.ఎ.ఆనంద్ కుమార్, డా.ఎస్.వెరోనికా, డా.వి.రోజా పాల్గొన్నారు.

నిండు ప్రాణాన్ని బలిగొన్న అతివేగం

- కారును ఢీకొన్న ఐస్ కంటైనర్
- ప్రభుత్వ ఉద్యోగి దుర్మరణం
- వ్యాన్ నుంచి దూకేసి ప్రాణాలు కాపాడుకున్న డ్రైవర్, మరో వ్యక్తి



ప్రమాదంలో నుజ్జయిన కారు, వంతెన రైలింగ్‌ను దాటి బయటకు చొచ్చుకెళ్లిన ఐసులోడుతో వెళుతున్న వ్యాన్



ఘటనా స్థలంలో కర్రి వెంకటరెడ్డి మృతదేహం

నరసాపురం రూరల్ /పెనుమంట్ర: అతివేగంతో వచ్చిన ఓ ఐస్ కంటైనర్ నిండు ప్రాణాన్ని బలిగింది. ఐస్ కంటైనర్ కారును ఢీకొన్న ఘటనలో ఓ ప్రభుత్వ ఉద్యోగి దుర్మరణం పాలవ్వగా వ్యాన్ నుంచి దూకేసి ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఎస్సై జి.వాసు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణా జిల్లా మచిలీపట్నం విద్యాశాఖ కార్యాలయంలో సమగ్రశిక్ష విభాగంలో సైట్ ఇంజనీర్‌గా కర్రి వెంకటరెడ్డి (45) పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా గరువారం వేకువజామున ఆయన రాజమండ్రికి కారులో బయలుదేరారు. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి వంతెన పైకి చేరుకున్న సమయంలో బంటుమిల్లి వెళుతున్న ఐస్ కంటైనర్ ఎదురుగా వస్తున్న వెంకటరెడ్డి కారును ఢీకొంది. తీవ్రంగా గాయాలపాలైన వెంకట రెడ్డిని 108 వాహనంలో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో కారు ముందుబాగం నుజ్జుయింది. ఐస్ కంటైనర్ కారు ఢీకొన్న అనంతరం వంతెన రైలింగ్ ఢీకొని కాల్వ వైపునకు వెళ్లి నిలబడింది. ఆ సమయంలో అప్రమత్తమైన లారీ డ్రైవర్ కవురు లీలాకృష్ణ, ఐస్ ప్యాకింగ్ బాయ్‌గా పనిచేస్తున్న కోమటితిప్పకు చెందిన శీలం ప్రియాంకవర్మ కాలువలోకి దూకేసి ప్రాణాలు రక్షించుకున్నారు. వీరిద్దరూ స్వల్పగాయాలతో బయటపడ్డారు. వెంటకరెడ్డి భార్య మేఘన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. కాగా మృతుడు వెంకటరెడ్డిది స్వగ్రామం పెనుమంట్ర మండలం నెగ్గిపూడి. ఆయనకు భార్య, నాలుగేళ్ల కుమార్తెతో పాటు ఒక సోదరుడు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు గురువారం రాత్రి నెగ్గిపూడి శ్మశానవాటికలో నిర్వహించారు.

పింఛన్ కోసం వెళితే.. మృత్యువు వెంటాడింది

పెంటపాడు: పింఛన్ కోసం వెళ్లిన ఓ వృద్ధుడిని మృత్యువు కారు రూపంలో వెంటాడింది. ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం పెంటపాడుకు చెందిన సున్నా పల్లారావు (70) గత నెల 31న గూడెం మండలం ఉప్పరగూడెంలో పింఛన్ తీసుకొనే నిమిత్తం బంధువు పాలంగి చంటితో కలిసి మోటార్‌సైకిల్‌పై వెళుతున్నాడు. ఎస్టీవీఎన్ స్కూలు వద్దకు వచ్చేసరికి కారు వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన పల్లారావును గూడెం ఏరియా ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. యువకుడి మృతి

నరసాపురం రూరల్ : రుస్తుంబాద అంబేద్కర్ నగర్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాలివి. పాలకొల్లు నుంచి తూర్పుతాళ్లు వెళుతున్న బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీ కొట్టడంతో బైక్ పై వెనుక కూర్చున్న పాలకొల్లుకు చెందిన కరగాని పండు (25) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి అచ్చాయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గంజాయితో పట్టుబడిన యువకుడి అరెస్ట్

ఏలూరు టౌన్: గంజాయితో పట్టుబడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఏలూరు గూడ్స్‌షెడ్డు రోడ్డులో టూటౌన్ సీఐ కే.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై మధు, పోలీసులు గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. దెందులూరు శ్రీసైనిక పేటకు చెందిన తియ్యాల సాయిదుర్గ (25) మోటారు సైకిల్‌పై వస్తూ పోలీసుల్ని చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేసి అతని వద్ద 5 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించడంతో ఏలూరు కోటదిబ్బలోని జిల్లా జైలుకు తరలించారు. టూటౌన్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రాంగ్ రూట్‌లో వచ్చి..

- కారును ఢీ కొట్టిన మరో కారు
- ఆరుగురికి గాయాలు



ఘటనా స్థలంలో రెండు కార్లు ధ్వంసమైన దృశ్యాలు



దెందులూరు: రాంగ్ రూట్‌లో వస్తున్న కారు ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టిన ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం వైపు నుంచి ఏలూరు వైపు ఐదుగురు కుటుంబ సభ్యులు కారులో ప్రయాణిస్తున్నారు. సోమవరప్పాడు గ్రామ శివారు వచ్చేసరికి ఏలూరు వైపు నుంచి రాంగ్ రూట్‌లో వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో జంగారెడ్డిగూడెం నుంచి వచ్చే కారులో ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా రాంగ్ రూట్‌లో వస్తున్న కారులో ప్రయాణిస్తున్న ఇద్దరిలో ఒకరికి చేయి విరిగింది. క్షతగాత్రులను దెందులూరు పోలీసులు 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు.

ముగిసిన అండర్ 23 బాస్కెట్‌బాల్ పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : గత రెండు రోజులుగా జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో నిర్వహిస్తున్న అండర్ 23 రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. గత రెండు రోజులుగా పలు జిల్లాల మధ్య ఈ పోటీలు రసవత్తరంగా సాగాయి. బాలురు విభాగంలో అనంతపురం, చిత్తూరు జిల్లాల మధ్య హోరాహోరీ పోరులో అనంతపురం విజేతగా, చిత్తూరు రన్నర్స్‌గా, మూడవ స్థానంలో తూర్పుగోదావరి జట్లు నిలిచాయి. అదే విధంగా బాలికల విభాగంలో ఫైనల్స్‌లో కృష్ణా, తూర్పుగోదావరి జట్లు తలపడగా కృష్ణా విన్నర్స్‌గా, తూర్పుగోదావరి రన్నర్స్‌గా, మూడవ స్థానంలో పశ్చిమ గోదావరి జట్లు నిలిచాయి. గెలుపొందిన క్రీడాకారుల జట్లకు ఏపీ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెంగ్రాలయనాయుడు తదితరులు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి అభినందించారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు బాబూ?

- కూటమి నేతల హామీపై మండిపడుతున్న నిరుద్యోగులు
- ఉపాధి ఇవ్వక.. నిరుద్యోగ భృతి లేక ఎలా అంటున్న వైనం
- తణుకు నియోజకవర్గంలో 25 వేలకు పైగా నిరుద్యోగులు


వైఎస్ జగన్ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన సచివాలయం

తణుకు అర్బన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులకు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారు. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసి, ఉద్యోగులను, నిరుద్యోగులతో చెలగాటం ఆడుతోంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ అమలుపై నిరుద్యోగులకు నిరీక్షణే మిగిలింది. ఉన్నత చదువులు చదివి ఉపాధి పొందేందుకు ఎదురుచూస్తున్న నిరుద్యోగులు తమకు ఇస్తానన్న నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా కూటమి నేతలు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి ఇవ్వకపోగా అభివృద్ధి చేస్తున్నామంటూ చెప్పుకుపోతున్న వైనాన్ని నిరుద్యోగులు ఎండగడుతున్నారు. విద్యాభ్యాసం పూర్తికాగానే ఉద్యోగాల ద్వారా ఉపాధి దొరుకుతుందని ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న నిర్వాకానికి మండిపడుతున్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన కూటమి నేతలు ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఇంతవరకు ఆ దాఖలాలే లేవని విమర్శలు చేస్తున్నారు. నిరుద్యోగ భృతిపై ఏదైనా అప్‌డేట్ ఉందా అంటూ నిరుద్యోగులు తమకు అందుబాటులో ఉన్న సచివాలయాలకు వెళ్లి సెక్రటరీలను ఆరా తీస్తున్నారు.

తణుకు నియోజకవర్గంలో 25 వేలకు పైగా నిరుద్యోగులు

గత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఎంత చదివితే అంతా ఉచితంగా చదువుకున్న విద్యార్థులు ఇంజనీరింగ్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సుల్లో విద్యాభ్యాసం పూర్తి చేసినప్పటికీ ఈ ఏడాది ఎటువంటి ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో కనీసం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు అయినా వస్తుందేమోనని ఎదురుచూపులు చూసినా అమలుకు నోచుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తణుకు పట్టణం, మండలం, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి 25 వేలకు పైగా నిరుద్యోగులు ఉన్నట్లుగా తెలుస్తోంది. వారంతా ఉపాధి ఎలాగో లేదు నిరుద్యోగ భృతి ఇచ్చినా కొంతమేర ఉపయోగపడుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచిపోవడంతో ఆ ఆశలు కూడా ఆవిరైపోతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వలేదు



కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తారని నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే ఏడాది గడిచిపోవడంతో మిగిలిన పాలనలోనైనా ఇస్తారా అనే సందేహం కలుగుతోంది. ఉన్నత చదువులు చదువుకున్నా ఉపాధి దొరక్కపోవడంతో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి అందిస్తే ఎంతో ఆసరాగా ఉంటుంది. –దిడ్ల సత్యానందం, తణుకు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరు సెమీ డోర్ సబ్ స్టేషన్ పరిధిలో మహాలక్ష్మి నగర్ ఫీడర్‌కు సంబంధించి విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఈ నెల 6వ తేదీ శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. మహాలక్ష్మీనగర్, కింబర్లీ స్కూల్ ఏరియా, చెట్లు రోడ్డు, టీటీడీ కల్యాణ మండపం ఏరియా, సత్యవతి నగర్, పీఅండ్‌టీ కాలనీ, పాతూరు ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నందున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా గోగులమ్మ ఊరేగింపు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కడకట్ల 32వ వార్డులో వేంచేసియున్న గోగులమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా గురవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద, అమ్మవారి పూరిగుడిసె వద్ద అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి పుట్టింటి, అత్తింటి వారి నుంచి నైవేద్యాలు సమర్పించారు. మేళ తాళాలతో, గరగ నృత్యాలతో, కేరళ డప్పులతో, శక్తి వేషాలతో, బాణసంచాలతో అమ్మవారి ఊరేగింపు సాగింది. సేవా సమితి కమిటీ నిర్వాహకులు రామిశెట్టి సురేష్ పర్యవేక్షించారు. మహిళలు, యువత, పిల్లలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వే ప్రతిపాదిత పనుల పరిశీలన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను–ప్రత్తిపాడు, నవాబుపాలెం రైల్వే లెవల్ క్రాసింగ్ (ఎల్‌సీ), రైల్వే ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు సాధ్యాసాధ్యాలను గురువారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి సౌంత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ ఇంజనీర్ పీవీ రమణారావు, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎస్.శ్రీనివాస్ పరిశీలించారు. కార్యక్రమంలో పెంటపాడు ఇన్‌చార్జి తహసీల్దార్ సీతారత్నం, సర్వేయర్ రామకృష్ణ, ఇరిగేషన్ డీఈ ధర్మజ్యోతి, ఏఈ సుధారాణి, కూటమి నాయకులు ఉన్నారు.

మాజీ మంత్రి కారుమూరి పరామర్శ


వైఎస్సార్‌సీపీ నేత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

ఇరగవరం: మండలంలో పేకేరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ సర్పంచ్ భర్త బెల్లంకొండ సురేష్ కుటుంబాన్ని గురువారం మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల సురేష్ తండ్రి మృతి చెందారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి అన్ని విధలుగా అండ దండగా ఉంటామని పేర్కొన్నారు. అనంతరం రేలంగి గ్రామంలోని ఎంపీటీసీ మెంటరాజు తమ్ముడు వివాహ కార్యక్రమానికి హజరై వధువు వరులను ఆశీర్వాదించారు. కార్యక్రమలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీటీసీలు మెంటరాజు, దొమ్మేటి శ్రీనివాస్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణాన్ని అడ్డుకోవద్దు


ఆందోళన చేస్తున్న స్థానికులు

పెంటపాడు: భక్తుల లక్షల రూపాయల విరాళాలతో ప్రత్తిపాడులో నిర్మిస్తున్న శివాలయ నిర్మాణాన్ని అధికారులు అడ్డుకోవడం తగదని శివాలయ నిర్మాణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా గురువారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రతిమాంబ సమేత సదాశివ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కలిసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిర్మాణాన్ని అడ్డుకొనేందుకు ప్రయత్నించిన పంచాయతీ, రెవెన్యూ అధికారులకు అడ్డు తగిలారు. ఈ సందర్భంగా ఓ పక్క ఎంపీడీవో బాలాజీ, ఎస్సై స్వామి సిబ్బందితో కలిసి వచ్చి గ్రామస్తులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. ఎవరు అడ్డు వచ్చినా నిర్మాణాన్ని ఆపేది లేదని గ్రామస్తులు తెలిపారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకొంది. గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులకు నచ్చజెప్పారు. గ్రామస్తులు, భక్తులు సంయమనం పాటించాలన్నారు. ఆందోళనలో కమిటీ అధ్యక్షుడు వీర్ల కృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి నృసింహుని కల్యాణోత్సవాలు

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామంలో ఉన్న శ్రీకుంతీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మంగళవారం వరకు స్వామి వారి కల్యాణోత్సవాలు వైకానస ఆగమ ప్రకారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ బ్రహ్మత్వంలో శుక్రవారం మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం, రాత్రి స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి సదస్యం, మంగళవారం ఉదయం పూర్ణాహుతి, చక్రస్నానం రాత్రి స్వామికి పుష్పయాగం నిర్వహిస్తామని వివరించారు. పుష్పయాగం తరువాత ఆలయం వద్ద కోలాటం జరుగుతుంని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విత్తనాల కొనుగోలులో బిల్లులు తప్పనిసరి

అత్తిలి: విత్తనాలు కొనుగోలు చేసే సమయంలలో తప్పనిసరిగా బిల్ తీసుకోవాలని డాట్ కో–ఆర్డినేటర్ ఫణికుమార్ అన్నారు. అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో గురువారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వా పంటకు అనవసరంగా ఎరువులు వాడొద్దని కోరారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దిబోరా, డాక్టర్ బిందు వీణ, మండల వ్యవసాయాధికారి టీకే రాజేష్, ఎంపీటీసీలు ముదునూరి దుర్గ భవాని, చేకూరి శ్రీనివాస్, సర్పంచ్ వట్టికూటి అనంత లక్ష్మి, గొడవర్తి తిరుపతిరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు .

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు


సర్వసభ్య సమావేశంలో సమీక్షిస్తున్న ఎంపీపీ

అత్తిలి: మండలంలో రైతులకు సబ్సిడీపై 2 డ్రోన్లు ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయాధికారి టీకే రాజేష్ తెలిపారు. అత్తిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మక్కా సూర్యారావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద పచ్చగడ్డిని పెంచే రైతులకు ఎకరాకు 69 వేలు అందజేస్తారని పశు సంవర్థక శాఖ అధికారి కె.శంకర భావన్నారాయణ తెలిపారు. కొత్తగా 37 గోకులం షెడ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అత్తిలి ఆరోగ్య కేంద్రం పరిధిలో 2 ఆశా వర్కర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వైద్యాధికారి నాగరాజు తెలిపారు. టెక్నీషియన్ పోస్ట్ ఖాళీగా ఉందన్నారు. మంచిలి పీహెచ్‌సీ పరిధి పాలిలో ఆశా వర్కర్ పోస్ట్ ఖాళీగా ఉన్నట్లు వైద్యాధికారి తెలిపారు. నాబార్డ్ నిధులతో అత్తిలి గుమ్మంపాడు రోడ్‌కు రూ.1.09 కోట్లు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ ఏఈ సూర్యనారాయణ తెలిపారు. రేషన్ కార్డుల్లో కొత్తగా 1776 మంది నమోదైనట్లు తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు. గతంలో ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులకు అనుకూలంగా లేక ఇళ్లు నిర్మించుకోని వారి స్థలాల అభివద్ధికి ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ మక్కా సూర్యారావు తెలిపారు. వసతి గృహాల్లో అధికంగా విద్యార్థులను చేర్చుకోవాలని ఆ శాఖ అధికారిని కోరారు. మంచిలి డ్రెయిన్ గత 10 సంవత్సరాలుగా తవ్వకపోవడంతో ఈడూరు, తదితర ప్రాంత పంట పొలాలు మునిగి పోతున్నాయని మండల ఉపాధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు తెలిపారు. కాలువలు తవ్విన మట్టిని గట్లపై వేయడం వలన ప్రయాణికులకు అసౌకర్యంగా ఉందని పాలూరు ఎంపీటీసీ శరకణం రామలింగ విష్ణుమూర్తి అన్నారు. అత్తిలిలో విద్యుత్ లోఓల్టేజ్ నివారించాలని ఎంపీటీసీ బుద్దాల రాంబాబు కోరారు. దువ్వ దానమ్మ గుడి నుంచి వరిగేడు వరకు అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ అడ్డాల జానకి కోరారు .ఈ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శామ్యూల్, తహసీల్దార్ దశిక వంశీ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, వైస్ ఎంపీపీ కొనకళ్ల విజయ నిర్మల, సుంకర నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

ఇరగవరం: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇరగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలో పని చేస్తున్న వంట సహాయకులు, సీసీహెచ్‌లకులో గురువారం ఒక రోజు శిక్షణ, వంటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమలో మండల విద్యాశాఖ అధికారి–2 జీవీబీ ప్రసాద్ రావు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం వండే విషయంలో వంట పాత్రలు, గది, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. మోనూ తప్పకుండా పాటించాలని, విద్యార్థులతో మర్యాదగా మెలగాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకం రిసోర్స్ పర్సన్ రమాదేవి మాట్లాడుతూ ఆకు కూరలు, కూరకాయలు, శుభ్రం చేసే విధానాలు విటమిన్స్, మినరల్స్ బయటకు పోకుండా శుభ్రం చేయాలని తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు, జి నాగమణి, ఇరగవరం కాంప్లెక్స్ సెక్రటరి కడలి సత్యనారాయణ, రేలంగి కాంప్లెక్స్ సెక్రటరీ పాలా పోలారావు, సీఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

కంచి కామాక్షమ్మ సన్నిధిలో ‘కొట్టు’


అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలో పునర్నిర్మించిన శ్రీకంచి కామాక్షమ్మ, శ్రీకామేశ్వరస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాన్ని ఎంతో అద్భుతంగా నిర్మించారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్, నాయకులు కర్రి భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, తమ్మిశెట్టి చుక్కయ్య, బొద్దాని శ్రీనివాస్, ప్రత్తి రంగయ్య, కనుపూరి ఉదయభాస్కర్, బండారు నాయక్, గరగ కేశవ, పాలగాని నాగబాబు, తమ్మిశెట్టి రఘు, ప్రత్తి రాజబాబు, గోపిశెట్టి దొరబాబు, బండారు వీర నాగేశ్వరరావు, వెంపలి వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

పోషక విలువలున్న ఆహారం అందించాలి

యలమంచిలి: మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు పోషక విలువలున్న సమతుల ఆహారాన్ని అందించాలని ఎంఈఓ–2 జీవీ సూర్యనారాయణ కోరారు. రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు పోడూరు మండలం జున్నూరు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం మండలంలోని అన్ని పాఠశాలల డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం కుక్ కమ్ హెల్పర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ–2 జీవీ సూర్యనారాయణ కోర్సు డైరెక్టర్‌గా, టీచర్ కొల్లాబత్తుల సూర్యకుమార్ రిసోర్స్ పర్సన్‌గా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన పోషక విలువలు కలిగిన సమతుల ఆహారాన్ని అందించాలన్నారు. అనంతరం వంటల పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హైస్కూల్ హెచ్ఎం కె.శివ జ్యోతి, సీఆర్‌పీ కాటం భారతి తదితరులు పాల్గొన్నారు.

సమృద్ధిగా మంచినీటి సరఫరా

నరసాపురం: వేసవిలో రెండుపూటలా కుళాయిల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట చెప్పారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కాలువలకు నీరు వదిలే వరకూ కుళాయి చెరువులో మంచినీటి నిలువ సరిపడగా ఉందన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తణుకు అర్బన్: మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండడమే కాకుండా అవగాహన కలిగి ఉండాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి, అర్బన్ హెల్త్ సెంటర్ల ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన మలేరియా మాసోత్సవం అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా మాత్రమే మలేరియా నివారణ సాధ్యమని, చలి జ్వరం ఉంటే తప్పనిసరిగా మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. ఈ వ్యాధిని వ్యాప్తి చేసే ఆడ ఎనాఫిలాస్ దోమ పుట్టుకను చెక్ పెట్టడానికి ప్రతి రోజూ ఖర్చురహిత డ్రైడే పాటించాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఎస్.డానియల్ రాజు, డాక్టర్ కె.పృథ్వీరాజ్, డాక్టర్ రాజా నాగభూషణం, ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్, ప్రభుత్వ ఆసుపత్రి ల్యాబ్, అర్బన్ పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే జీవుల మనుగడ


తణుకు అర్బన్: మొక్కలు నాటుతున్న డీవైఈఓ, తదితరులు


తణుకు అర్బన్: మొక్కలు నాటుతున్న ఆంధ్రా షుగర్స్‌జీఎం


తాడేపల్లిగూడెం రూరల్: మొక్క నాటుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్


తాడేపల్లిగూడెం (టీఓసీ): మొక్కలు నాటుతున్న రిసోర్స్‌పర్సన్లు


అత్తిలి: మొక్కలు నాటుతున్న రిటైర్డ్ టీచర్


పెంటపాడు: మొక్కలు నాటిన అంగన్‌వాడీ వర్కర్లు

అత్తిలి: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే మనం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించగలమని, పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ సాధ్యమని రిటైర్డు టీచర్ కె.వెంకట్రావు అన్నారు. అత్తిలి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రంథాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి.కృష్ణారావు, రిసోర్సు పర్సన్ బి.నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, ఎస్.దుర్గాప్రసాద్, కె.అనుపమ, ఎం.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

తణుకు అర్బన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యత చేపట్టాలని డీవైఈవో డి.మురళి సత్యనారాయణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.ఉమాదేవి, వెంకటలక్ష్మి, పాల్ డేవిడ్‌రాజు, సులోచన రాణి, రాంబాబు, సుజాత భాను, శ్రీలక్ష్మి, షరీఫ్, దుర్గారావు, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా షుగర్స్‌లో..

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ది ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంస్థ జనరల్ మేనేజరు (హెచ్‌ఆర్) ఎ.సాంబశివరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సూచనల మేరకు సంస్థ ఆవరణలో వెయ్యికి పైగా మొక్కలు నాటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంస్థ చీఫ్ కెమిస్ట్ బి.శ్రీనివాసరావు, ఎన్విరాన్‌మెంట్ విభాగం నుంచి జి.బాబూరావు, జి.ధనుంజయ, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

తాడేపల్లిగూడెం రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని నవాబుపాలెం అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు పోతుల అన్నవరం, ములకాల సూర్యారావు, ఉండ్రాజవరపు చంద్రిక, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, డిప్యూటీ ఎంపీడీవో ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

తాడేపల్లిగూడెం: పర్యావరణ పరిరక్షణ అందరి ఉమ్మడి బాధ్యత అని ఉద్యానవర్సిటీ వీసీ డాక్టర్ కె.గోపాల్ అన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గిస్తూ, నాణ్యమైన మొక్కలను అందరూ నాటాలని బుధవారం వర్సిటీలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కేవీకే ప్రాంగణంలో పలు జాతుల మొక్కలు నాటారు. వర్సిటీ అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో పర్యావరణ దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక తాడేపల్లిగూడెం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు. వేసవి శిక్షణా శిబిరం గురువారం రిసోర్స్ పర్సన్ల పర్యవేక్షణలో నిర్వహించారు. గ్రంథాలయాధికారి పి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. అదే విధంగా స్థానిక భవిత దివ్యాంగుల శిక్షణా కేంద్రం ఆవరణలో పర్యావరణ దినోత్సవం సదర్భంగా మొక్కలను నాటారు. అలాగే మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో గురువారం అసోసియేషన్ అధ్యక్షురాలు వసచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా కార్యకమాల్లో ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య, అనిల్ కుమార్, అంగన్‌వాడీలు సత్యవతి, రత్నకుమారి, దివ్యాంగ విద్యార్థులు, కుంట్ల కనకదుర్గ, ఆర్.ఉదయ్‌కుమారి, టి.అరుణ కుమారి, మేరీ వజ్రమ్మ, రామలక్ష్మి, చంటమ్మ, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అంగన్‌వాడీలు

పెంటపాడు: అంగన్‌వాడీ వర్కర్ల ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మొక్కలు నాటారు. సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం పలు కేంద్రాల వద్ద నిర్వహించారు. సూపర్‌వైజర్లు జీజీబీ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గోవధ నిషేధంపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న పశు సంవర్థక శాఖ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో గురువారం గోవధ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆవులు, దూడలు వధ నిషేధమని ఎమ్మెల్యేచే గోడ పత్రికను ఆవిష్కరించారు. పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌కే సుధాకర్ మాట్లాడుతూ అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్‌లోని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, పశు వైద్యాధికారులు, పారా వెటర్నరీ సిబ్బంది, జంతు సంక్షేమ సంఘం సభ్యురాలు పావని తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

అత్తిలి: బక్రీదు పండుగ సందర్భంగా జంతువులను వధించరాదని, ప్రభుత్వ చట్టాలను, సూచనలను తప్పనిసరిగా పాటించాలని మండల పశువైద్యాధికారి కె.శంకరభావన్నారాయణ చెప్పారు. కాని ఆవులు, దూడలు, ఒంటెల వధను మన రాష్ట్రంలో పూర్తిగా నిషేధించారన్నారు. అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో ఆవు దూడలు, ఒంటెల వధ నిషేధం పోస్టర్‌ను ప్రజా ప్రతినిధులు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, వైస్ ఎంపీపీ కొనకళ్ల విజయనిర్మల, జిల్లా జంతు సంక్షేమ శాఖ డైరెక్టర్ అజయ్‌కుమార్, ఎంపీడీవో శామ్యూల్ పాల్గొన్నారు.